# ప్రేమ లేఖలు

"మహేశ్వర్"

"...గతవారం సంతలో మూడుఅణాల ఆరు దమ్మిడీలుఇచ్చి సరిక్రొత్త కొబ్బరితాడు కొనబడింది! పొడవునిచ్చెన కొవెలిపొచ్చి, రెండు చిన్ననిచ్చెనలు జోడింప నిమిత్తమై ఆ తాడు ఉపయోగింపబడిన తరువాత, నిన్న మనకంపెనీ ఆవరణ ఈశాన్యమూలన పడవేయగా, రాత్రి నిశాచరుడు (Night watchman) దఫా, దఫా, బీడీ వెలిగించుకొనుటకుగాను ఆ తాడును నిప్పంటించి తెల్లవార్లూ ఉంచుటవలన ఎనిమిదిన్నర గజాల తాడులో ఒకఅడుగూ మూడంగుళాలు కాలి తరిగిపోయినది! ఇది మీ భోగట్టా కొరకు! (For your information)

గిడ్డంగి (Store) గుమస్తా.

"నిశాచరునకు ఆరణాలు జుల్మానా వేయబడినది!"

అధికారి.

"గ్రహించితిని (Noted)"

ఖజాంచీ.

* * *

"...నిన్నరాత్రి పన్నెండూ నాలుగు నిముషాలకు పెద్దయంత్రమునకు ఆయాస మెక్కువగుటచే (overload) పన్నెండూ పదిహేను గంటలకు యంత్ర ప్రధానభాగము (Main part of the engine) పటాపంచలైనది. మనకి క్రొత్త 'భాగము' హాజరులోలేదు. ఇది మీరు తెలుసుకొనునిమిత్తమై దాఖలు చేసుకొనడమైనది!

ప్రథమ మానసి! (Foreman)"

"దానిఖరీ దెంతైయుండును?

అధికారి"

"షుమారు 500 రూపాయలకుపైగా ఒకసారి కొనియుంటిమి!

మునియంజీ."

"క్రొత్తదానికై లాహోరునకు తంతి నివ్వవలెను!"

అధికారి.

* * *

"కొలిమినిప్పుకై అగ్గిపెట్టి కొనుటకుగాను మూడుకానులు మంజూరుచేయింప ప్రార్థన!"

"గత పర్యాయము అగ్గిపెట్టెకొన్న తేదీయున్నూ, పెట్టెలో ఎన్నిపుల్లలు ఉంటున్నదీనూ విశదీకరింపుము!"

"18-3-1939 లో రెండు పెట్టెలు మాత్రము కొనియున్నాము!"

"ఈ ఐదు సంవత్సరములకూ రెండుపెట్టెలు ఎట్లా సరిపడినవి?"

"పాత కమ్మరివద్ద చెకుముకిరాయి ఉండుటచే నిప్పుపెట్టె అంతగా అవసరము లేకుండెడిది. ఇపుడీ కమ్మరివద్ద అటువంటి పరికరములు లేకపోవుటచే నిప్పుపెట్టె అవసరము ఎంతైనాయున్నదని మనవిచేయడమగుచున్నది!"

"పనివాళ్ల ధూమపానావసరార్థములకై వినియోగింపరాదనే షరతుమీద మూడు కాన్లు మంజూరు చెయ్యడమైనది!"

* * *

"...నాలుగురోజుల మధ్యా టాంకులోనుంచి షుమారు వెయ్యిగేలన్లు నూని కారిపోయి నష్టమైనది! టాంకుపై మూత సరిగా లేకపోవుటచే వర్షపునీరంతా టాంకుకు మూడువంతులు నిండిపోయినది. ప్రస్తుతం టేంక్‌లో ఉన్నది వర్షపునీరో, నూనో, తెలియరాకున్నదని విన్నవించుకొనుచున్నాను...

ఇంజనీరు"

"ఆలోచింప బడుతుంది!

అధికారి"

* * *

"...ఇవాళ ఉదయం తెచ్చిన నూరు రూపాయల చిల్లరలోనూ ఒక అర్ధణా తరుగు వచ్చినదని మనవి:

ఖజాంచీ"

"అందుకు చిల్లర మోసుకొచ్చిన వానిదగ్గర నుండి పంజాయిషీ తీసుకొనుము!

అధికారి"

"...చిల్లర సంచీ రంధ్రములనుండి పచ్చిమిరపకాయలైనా జారు నవకాశము లేదు గనక, పాతిక రూపాయల పరక్క కాసుల్లోనూ లెఖ్ఖలో తిరకాసొచ్చుండొచ్చునని పొరబాటును మనవి చేసుకున్నాడు! సంజాయిషీ తీసుకుని దఖలు పర్చడమైనది—

ఖజాంచీ"

"అజాగ్రత్తకుగాను ఒకపూట హాజరు వేయకుము!

అధికారి"

"అట్లే ఒనర్చితిని! (Done it accordingly)

ఖజాంచీ"

* * *

"...లాహోరునుండి వచ్చిన హుండీ బిల్లు! (Demand Draft) మొత్తము Rs. 588-12-6 Bank లో చెల్లించి రైలురశీదు విడిపించినాను. వెంటనే స్టేషనుకు పంపగా, పేకేజీ పెట్టి భండారమంతయు బ్రద్దలైపోవుటచే లోనున్న యంత్రభాగము దెబ్బతిన్నదేమోనని అనుమానాస్పదముగానున్నదని విన్నవించుకొనుచున్నాను!

ఖజాంచీ"

"రైల్వే అధికారులనడిగి బహిరంగబట్వాడా (Open Delivery) తీసుకొనుటకు ఏర్పాటు చేయుము!

అధికారి"

"...నిన్న లాహోరునుండి వచ్చిన యంత్రభాగము మూడుముక్కలై ఉన్నందున పనికి రాకపోవుటచే ఒకమూలనుపార వేసితినని మనవి!

ఇంజనీరు"

* * *

"లోభిసొమ్ము మస్సానఖాయే"

(పాఠాంతరం)

## మళ్ళీ....

మం. వెంకటేశ్వరరావు

శాంతిభద్రతా
సమావేశ-ఉపన్యాస
పదళయ్యామృతధారల
మది మెచ్చే ఇచ్చే జోహారులు,
నేతిబీరకాయ కోతలు
'శివశివ' యను జారులు; చోరులు-

'సర్వేజనే సుఖినోభవంతు
సామ్రాజ్యాలు మాత్రం మావంతు
మీకూ మాకూ నేస్తం
మీదేశంలో తిష్ఠవేస్తాం,
'పోట్సుడామ్' ఏకాంతాలు
'పోస్టువార్' వేదాంతాలు;

మాటలు 'క్వినైను' మాత్రలు
మనబోంట్లకు భిక్షాపాత్రలు;

పంపకాల కుంపిణీలు
శాంతి బాల లంఖణాలు,
కనుకొలకుల్లో ఎరుపులు
మనసుల్లోపల పొరుపులు;

చితికినదేశాల్లో
స్వేచ్ఛకు పాశాలు
గొప్పవాళ్ళు మరీ గొప్పవాళ్ళు
బీదవాళ్ళు మరీ బీదవాళ్ళు,

అణిగిన దేశాల్లో పెద్దలు
అవులించు మన స్పర్థలు
హద్దులు పెంచాలని అరుపులు,
ఆశాభరమా తియ్యని తలపులు
తలకెక్కిన ఉన్మత్తుల పరుగులు
'త్రుప్పెక్కిన కత్తుల మెరుగులు
మ్రోగేగంటలు! రేగేమంటలు!!'
మళ్ళీ..............!!